Sakshi Dt. 02/03/19.

సాక్షి హైదరాబాద్ | శనివారం | మార్చి | 2 | 2019

# రెండెకరాల్లో 'తరుణి' నుమాయిష్

- మధురానగర్ మెట్రో స్టేషన్ వద్ద..
- హెచ్ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: అమీర్‌పేట్–హైటెక్‌సిటీ మార్గంలోని మధురానగర్ మెట్రో స్టేషన్ వద్ద రెండెకరాల్లో మహిళలు, పిల్లల అవసరాలకు అనుగుణంగా 150 దుకాణాలతో తరుణి నుమాయిష్ ఏర్పాటు చేయనున్నట్లు హెచ్ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఈ స్టేషన్‌కు సైతం తరుణి అనే పేరు పెట్టనున్నట్లు తెలిపారు. ఈ ప్రాంగణంలో 70 కార్లు, 400 ద్విచక్ర వాహనాలు ఏకకాలంలో పార్కింగ్ చేసే అవకాశం కల్పిస్తామన్నారు. ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న అమీర్‌పేట్–హైటెక్‌సిటీ (10 కి.మీ) మెట్రో మార్గంలో మిగిలిన సుందరీకరణ పనులను సత్వరం పూర్తి చేయాలని నిర్మాణ సంస్థ ఎల్అండ్‌టీ, హెచ్ఎంఆర్ అధికారులను ఆయన ఆదేశించారు. శుక్రవారం ఈ మార్గంలో ఇంజినీర్లు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మిగిలిన పనుల పూర్తికి ఆయా విభాగాల అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ మార్గంలోని మొత్తం 8 మెట్రో స్టేషన్ల వద్ద మిగిలిన పనులను ఎల్అండ్‌టీ సత్వరం పూర్తి చేయాలని, స్టేషన్లలో డిజైనర్ కాలిబాటల్లో



అమీర్‌పేట్–హైటెక్ సిటీ మార్గంలో పనులను పరిశీలిస్తున్న హెచ్ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

వాహనాలు పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని మెట్రో స్టేషన్ల వద్ద బస్సులు, ఆటోలు నిలిపేందుకు ప్రత్యేక మార్గాలు, ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. యూసుఫ్‌గూడ మెట్రో స్టేషన్ వద్ద ఎల్అండ్‌టీ ఏర్పాటు చేసిన కంటైనర్లు, యంత్రాలు, ఇతర సామగ్రి తొలగించాలని, ఆ ప్రాంతంలో మెట్రో ప్రయాణికులకు పార్కింగ్ సదుపాయం కల్పించాలన్నారు. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్.5 స్టేషన్ నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో మిగిలిన శిథిలాలను, రాళ్లను తొలగించాలని, ఇక్కడి ఖాళీ జాగాలో పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. జూబ్లీ చెక్‌పోస్ట్ స్టేషన్‌లో ప్రయాణికులకు ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాల్లో అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని, ఈ స్టేషన్ పరిసరాల్లో ఇటీవల కొనుగోలు చేసిన ప్రైవేటు జాగాలో పార్కింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. మాదాపూర్ స్టేషన్‌కు 100మీటర్ల దూరంలో ఉన్న నీరూ దుకాణం వద్ద మెట్రో సేకరించిన స్థలంలో పార్కింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. దుర్గం చెరువు స్టేషన్‌కు పార్కింగ్ అవసరాలకు ప్రైవేట్ స్థలాలను సేకరించాలని అధికారులకు సూచించారు. హైటెక్ సిటీ స్టేషన్ ప్రయాణికులు తమ వాహనాలను ఎల్అండ్‌టీ మాల్ దిగువన పార్కింగ్ చేసుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలని సూచించారు.